# ఆర్థిక చక్రగతి - లోటు బడ్జెట్‌ల సంబంధం?

**ఆర్థిక శాస్త్రానికి సంబంధించిన పదజాలం వార్తాపత్రికల్లో తరచూ కనిపిస్తుంటుంది. ఆ భావనలు తెలిస్తే తప్ప సంబంధిత వార్త గానీ కథనం గానీ స్పష్టంగా అర్థం కాదు. అందుకే ఆ పదాల గురించి ప్రాథమిక అవగాహన పెంచుకోవటం పోటీ పరీక్షల అభ్యర్థులకు అవసరం!**

“అబ్బబ్బ! లోటు... లోటు... పంచాయితీ దగ్గర్నుంచి కేంద్ర ప్రభుత్వం దాకా ఎవర్ని కదిలించినా లోటు బడ్జెట్లే. అసలు లోటు లేని మనిషి గానీ, దేశం గానీ ఉన్నారా? ” విసుక్కుంటూ వచ్చాడు కొండల్రావ్.

“ఒక పక్క పొలం ఖర్చులు పెరిగాయి, అయినా సరిపోతుందిలే అనుకుంటే అమ్మాయి చదువు ఫీజులు కూడా పెంచారని తెలిసింది. ఇప్పుడెలా? ” ఆందోళనతో అడిగాడు.



**నూతక్కి విజయశేఖర్**
www.teluguvartalu.com

“సింపుల్! ఎక్కడన్నా అప్పు చెయ్యి. రాబడి కన్నా ఖర్చులు జాస్తి అవడం అందరికీ మామూలేలే. దేశాలకే లోటు బడ్జెట్ తప్పడం లేదు. ఆ లోటు పూడ్చుకునేందుకు అప్పులూ తప్పడం లేదు. నీ కుటుంబం ఎంత? ” మర్మం చెప్పాడు రామారావు.

“ఎప్పుడూ లోటు బడ్జెట్లేనా అని ప్రతిపక్షాలు గవర్నమెంట్‌ని తిట్టిపోస్తుంటే నువ్వేంటి ఇలా అంటావ్? ”

“దీన్నంత తేలిగ్గా తీసిపారెయ్యకు. ఇప్పుడు మొత్తం ప్రపంచం అంతా నడిచేది లోటు బడ్జెట్లతోనే. దీనిపైన గొప్ప ఆర్థిక సిద్ధాంతాలే ఉన్నాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత కీన్స్ ప్రతిపాదించిన ‘లోటు వ్యయం’ సిద్ధాంతం వల్లనే పశ్చిమ దేశాలు బతికిపోయాయి” నేరుగా సబ్జెక్టులోకి దిగిపోయాడు రామారావు.

“ఏంటీ... లోటు బడ్జెట్ మీద సిద్ధాంతాలు కూడానా? ఎవరు బాబూ ఆ కీన్సు? ”

“జాన్ మేనార్డ్ కీన్స్ అనీ, ఓ పెద్ద బ్రిటిష్ ఆర్థిక సిద్ధాంతవేత్త, క్లాసికల్ ఎకనమిక్స్‌ని మలుపు తిప్పిన పెద్దమనిషి. దేశాల ఆర్థిక వ్యవస్థలు సమతూకంతో కూడిన బడ్జెట్లే ప్రతిపాదించాలని అప్పటివరకూ నమ్మేవాళ్లు. అంటే ఆదాయం ఎంతుంటే అంతే ఖర్చు పెట్టాలని అర్థం. మిగులు ఉండొచ్చుగాని లోటు ఉండడానికి వీల్లేదనేవాళ్లు. లోటు ఉందంటే ఆ దేశ ఆర్థిక పరిస్థితి బాగాలేదని నమ్మేవాళ్లు. కీన్స్ సిద్ధాంతంతో అది తిరగబడింది.

పెట్టుబడిదారీ చక్రభ్రమణ పరిణామాల వల్ల సంక్షోభాలు మళ్ళీ మళ్లీ వస్తాయని అప్పటికి నిర్ధారణ అయింది. ఆర్థిక వృద్ధి బూమ్ దశలో ఉన్నప్పుడు మిగులు బడ్జెట్లు ఉండాలని, మాంద్యం దశలో ఉన్నప్పుడు లోటు బడ్జెట్లతో వినియోగం పెంచి తద్వారా ఆర్థిక కార్యకలాపాలకు ఊపు తేవచ్చని కీన్స్ ప్రతిపాదించాడు. కీన్స్ సిద్ధాంతాన్ని పెట్టుబడిదారీ దేశాలు వద్దు వద్దంటూనే ఇప్పటికీ పాటిస్తున్నాయి” వివరించాడు రామారావు.

“అప్పుచేసి పప్పుకూడు తింటే తప్పు లేదంటావ్! సరే, మధ్యలో ఈ చక్ర భ్రమణాలు ఏమిటో? ”


“సముద్రానికి ఆటుపోట్లు ఎంత సహజమో పెట్టుబడిదారీ మార్కెట్ ఆర్థిక వ్యవస్థల్లో ఆర్థిక ఉత్థానపతనాలు అంత సహజం. మార్కెట్ ఎకానమీలు నాలుగు దశల గుండా ప్రయాణిస్తాయి. 1. విజృంభణ (బూమ్) 2. మందగమనం (స్లో డౌన్) 3. మాంద్యం (రిసెషన్) 4. స్వస్థత (రికవరీ). ఇవి వరసగా వలయాకారాన్ని సూచిస్తూ మళ్లీ మళ్లీ వస్తాయి. అందువల్ల ఒక్కో చుట్టును ఒక్కో ఆర్థిక చక్రం అంటారు. ఆర్థిక చక్రం 7 నుంచి 12 సం.ల వరకు ఉండవచ్చని కొందరు ఆర్థికవేత్తలు సూచించారు. కాలం విషయంలో విభేదాలున్నా, చక్రగతిని ఇప్పుడు ఎవరూ కాదనరు”

ఆర్థిక చక్రగతికీ, లోటు బడ్జెట్లకీ సంబంధం ఏమిటో తెలియాలంటే మొదట చక్రగతిని కాస్త వివరంగా చూడాలి. విజృంభణ దశలో జి.డి.పి. వృద్ధి ఉచ్ఛదశలో ఉంటుంది. ఆ మేరకు నిరుద్యోగం తగ్గుతుంది. నైపుణ్య కార్మికులను ఆకర్షించడానికి వేతనాలు ఎక్కువ ఇవ్వజూపుతారు. వినియోగ సరుకుల ఉత్పత్తి పెంచడం కోసం పెట్టుబడి సరుకులకి గిరాకీ పెరుగుతుంది. గిరాకీకి తగ్గ సరుకులు దేశంలో లేకపోతే దిగుమతులు పెరుగుతాయి. వినియోగం పెరుగుతుంది కనుక ప్రభుత్వ పన్నుల ఆదాయం పెరుగుతుంది. సరుకులకు గిరాకీ పెరుగుతుంది కనుక ధరలూ పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. దాన్ని కట్టడి చేసేందుకు సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్లు పెంచుతాయి.

మరోవైపు కంపెనీల లాభార్జన పెరుగుతుంది. కానీ లాభాలూ, ధరలు పెరిగే దామాషాలో వేతనాలు పెరగవు. ఒకానొక దశలో మార్కెట్లో వైరుధ్యం తలెత్తుతుంది. పెరిగే ధరలకు తగ్గట్టుగా ప్రజల కొనుగోలు శక్తి (ఉపాధి) పెరగకపోవడమే ఆ వైరుధ్యం. దాంతో కొనుగోళ్ళు పడిపోయే దశ మొదలవుతుంది. షాపుల అరల్లో సరుకులు మిగిలిపోతాయి. దాంతో కొత్త ఉత్పత్తి తగ్గిపోతుంది. అంటే జి.డి.పి. తగ్గుతుంది. ఇది మందగమనం దశ. ఈ దశలో జి.డి.పి. వృద్ధి ఉంటుంది గానీ వృద్ధి రేటు తగ్గుతుంది. ఇలా వృద్ధి తగ్గేకొద్దీ ఉద్యోగుల్ని తొలగిస్తారు. నిరుద్యోగం పెరుగుతుంది. దానివల్ల కొనుగోలు శక్తి ఇంకా తగ్గిపోతుంది. కొనుగోళ్ళు లేక ఉత్పత్తి ఇంకా తగ్గిపోతుంది. చివరికి జి.డి.పి. గత సంవత్సరం/ త్రైమాసికం కంటే తగ్గిపోతుంది. అంటే ఆర్థిక వ్యవస్థ విస్తరించడానికి బదులు సంకోచిస్తుంది. మైనస్ జి.డి.పి. వృద్ధి నమోదు అవుతుంది. ఇలా వరుసగా రెండు త్రైమాసికాల పాటు మైనస్ వృద్ధి రేటు నమోదు అయితే దాన్ని మాంద్యం అంటారు.

మామూలుగా అయితే మాంద్యం దశలో ఉత్పత్తి కార్యకలాపాలు, వ్యాపారాలు మందగిస్తాయి. కాబట్టి దేశాలకు ఆదాయం తగ్గిపోతుంది. సమతూకపు బడ్జెట్ నడపాలంటే బడ్జెట్ కూడా తగ్గించుకోవాలి. ఇక్కడే కీన్స్ సిద్ధాంతం పశ్చిమ దేశాన్ని ఆదుకుంది. ఆర్థిక మాంద్యం




వచ్చినా జనాభా తగ్గదు. వారి అవసరాలూ తగ్గవు. కనుక వినియోగం తగ్గకూడదు. ఈ విషయాన్ని కీన్స్ సిద్ధాంత రూపంలో చెప్పాడు. మాంద్యంలో కూడా జనాభా మొత్తం గిరాకీ (aggregate demand) ఎక్కడికీ పోదని, జనం దగ్గర కొనుగోలు శక్తి లేనందునే వినియోగం తగ్గుతుంది తప్ప గిరాకీ లేక కాదని కీన్స్ సిద్ధాంతం. లోపించిన కొనుగోలు శక్తి స్థానంలో ప్రభుత్వం ప్రవేశించి ఆదాయానికి మించి వ్యయం చేయాలని ప్రతిపాదించాడు. 1. వడ్డీ రేట్లు తగ్గించి మరింత డబ్బును ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశపెట్టడం 2. ప్రభుత్వమే అదనంగా వ్యయం చేసి గిరాకీ పెంచడం... ఈ రెండు చర్యలను ప్రయోగించి ఆర్థిక వ్యవస్థకు ఊపు తేవచ్చని కీన్స్ సిద్ధాంతీకరించాడు. ఆదాయ అంతరాలున్న సమాజంలో ధనిక వర్గాల వద్ద వినియోగంలోకి రాని సంపద పేరుకుపోయి ఉంటుంది. దాన్నే రుణాలుగా సేకరించి వ్యయం చేయాలని ప్రతిపాదించాడు. ప్రైవేటు రంగం ఆధిపత్యం వహిస్తూనే ప్రభుత్వ రంగాన్ని పోషించాలని చెప్పాడు.

కీన్స్ ప్రకారం ప్రభుత్వం ఏం చేయాలి? రాబడికి తగిన వ్యయం అన్న సూత్రం వదిలి రాబడిని మించి ఖర్చు చేయాలి. లోటు బడ్జెట్ అమలు చేసి లోటును రుణాల ద్వారా పూడ్చుకోవాలి. ఉదాహరణకి మౌలిక రంగాల్లో ఖర్చుపెట్టాలి. అలా చేస్తే ఉద్యోగాలు వస్తాయి. ప్రజల ఆదాయం పెరుగుతుంది. వినిమయం పెరుగుతుంది. మరోవైపు వడ్డీ రేట్లు తగ్గించినందున వాణిజ్య బ్యాంకులు కూడా వడ్డీ రేట్లు తగ్గిస్తాయి. పారిశ్రామికవేత్తలు, వ్యాపారులు ధైర్యంగా రుణాలు తీసుకుని ఉత్పత్తి కార్యకలాపాల్లోకి దిగుతారు. ఆ విధంగా ఉత్పత్తి పెరుగుతుంది. వినిమయమూ పెరుగుతుంది. ఆర్థిక వ్యవస్థ తిరిగి గాడిన పడుతుంది.

అయితే ఆచరణలో కీన్స్‌ని సగం వరకే ప్రభుత్వాలు అనుకరిస్తున్నాయి. మొదటిది అమలు చేసి రెండోది గాలివి వదిలేస్తున్నాయి!